పల్లెల్లో స్థానిక సమరం వేడి





పలమనేరు మండలంలోని కల్లాడు సచివాలయం

జిల్లాలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వేడి కాస్త ముందుగానే మొదలైంది. ఈదఫా ఎన్నికలు ముందుగా రానుండడంతో ఎలాగైనే గెలవాలనే ధ్యేయంతో కొందరు అప్పుడే గ్రామాల్లో రాజకీయ వేడిని పుట్టిస్తున్నారు. మరోవైపు గతంలోలాగే ఎలాగైనా స్థానిక సంస్థల్లో విజయం సాధించాలని కూటమి నేతలు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమకు అనుకూలమైన వారికి రిజర్వేషన్లు దక్కేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. దీనికితోడు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలు సైతం అధికారపార్టీని ధీటుగా ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

- స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల విషయంలో నేతల ప్లాన్
- ఇప్పటి నుంచే తాము అభ్యర్థులమంటూ చెప్పుకుంటున్న పలువురు
- వచ్చే జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిపే యోచనలో ఎన్నికల కమిషన్
- గెలుపే ధ్యేయంగా పావులు కదుపుతున్న కూటమి నేతలు

పలమనేరు: ఏ పంచాయతీలో ఎవర్ని అభ్యర్థిగా పెడితే బాగుంటుందో అనే కోణంలో స్థానిక కూటమి నేతలు అప్పుడే ప్లాన్ చేసుకున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగినప్పుడు ఎలా గెలుపొందారో దానికి మించి ఈ దఫా ఎన్నికల్లో గెలిచేందుకు కూటమినేతలు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆ మేరకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేశామని, దీంతో తప్పకుండా స్థానిక సంస్థల్లో గెలుపు ఖాయమనే ధైర్యంతో కూటమి నేతలు ఏ మాత్రం భయం లేకుండా ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. అయితే ప్రభుత్వ హామీలను నెరవేర్చకపోవడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫోకస్ పెట్టి ఈ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని నిరూపించేలా ముందుకెళ్తున్నారు. మొత్తం మీద ఇప్పటి దాకా ప్రశాంతంగా ఉన్న గ్రామాలు స్థానిక సమరంతో ఎన్నికల వేడి జోరుగా కనిపిస్తోంది.

గతంలో పేపర్ బ్యాలెట్ విధానంలో..

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 2021లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలోని 1411 పంచాయతీలు, 13,574 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఇందులో కోర్టు కేసులు, పంచాయతీ విలీనాలు పోగా మిగిలిన 1368 పంచాయతీలకు నాలుగు దఫాలుగా ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 358 స్థానాల్లో సర్పంచులు ఏకగ్రీవం అయ్యారు. అప్పట్లో ఎన్నికలు బ్యాలెట్ పేపర్ విధానంలో జరిగాయి.

ఈదఫా ముందుగానే స్థానిక సమరం..

2021లో గతంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. దీంతో వచ్చే 2026 ఏప్రిల్‌లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం స్థానిక ఎన్నికలను మూడునెలలు ముందుగా జరిపించేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఆ మేరకు అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, పంచాయతీల రిజర్వేషన్ల ఖరారు జరగనుంది. ఆపై అక్టోబరు 16 నుంచి నవంబరు 15 దాకా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుంది. ఆపై డిసెంబరు 16లోగా రిజర్వేషన్ల ఖరారు, రాజకీయ పార్టీలతో సమావేశాలు, 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి అదే నెలలో ఫలితాలు రానున్నట్టు తెలుస్తోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఎన్నికలు జరగ్గా కూటమి నేతలు టర్న్ అవుట్ ఓట్ల ద్వారా పలుచోట్ల భారీగా గెలిచిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రస్థాయిలోనే కాదు దేశంలోనే పెద్ద దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఈ దఫా స్థానిక సంస్థల ఎన్నికలను సైతం ఈవీఎంలా ద్వారా నిర్వహించాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అదేవిధంగా ఈసారి ఎన్నికలను ఈవీఎంలతో జరిపేందుకు కూటమి ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

16 నుంచి వార్షిక పవిత్రోత్సవాలు

గంగవరం: మండలంలోని కీళపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ మంగళ వారం నుంచి నాలుగు రోజుల పాటు స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వి.కోట: పట్టణంలోని ఎస్కే ఎమర్జెన్సీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరు మణిపాల్ హస్పిటల్ వైద్యబృందంచే పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లోని కరీం కాంప్లెక్స్ ఎదురుగా ఎస్కే హాస్పిటల్ వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ పి.శివ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కంటి జబ్బులు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

క్లుప్తంగా

83 కేసుల పరిష్కారం



కుప్పం కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ దృశ్యం

కుప్పం రూరల్: కుప్పం కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 83 కేసులు పరిష్కరించి నిందిలకు జరిమానా విధించినట్లు చిత్తూరు అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.రవి తెలిపారు. 4 సివిల్ కేసుల నిందితులకు రూ.2,50,000 జరిమానా విధించినట్లు తెలిపారు. 74 క్రిమినల్ కేసుల్లో రూ.7,89,685, బ్యాంకు పీఎల్‌పీకు చెందిన 5 కేసుల్లో రూ.19,74,542 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కేసులన్నీ రాజీ మార్గంలో పరిష్కరించినట్లు జడ్జి కె.రవి తెలిపారు. ఏపీపీ ప్రశాంతి, బార్ ప్రెసిడెంట్ చంద్రప్ప తెలిపారు.

రైతు వ్యతిరేక కూటమి



మాట్లాడుతున్న గాజుల భాస్కర్

పుంగనూరు: కూటమి ప్రభుత్వం రైతులకు పూర్తి వ్యతిరేకమని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయిందని అన్నమయ్య జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ గాజుల భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ చేయడంలో విఫలమైందన్నారు. టమాటా, బొప్పాయి, మామిడి, వరి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. హంగు, ఆర్భాటాలు, నెలకొక్కసారి ఈవెంట్లు కలిపి సూపర్ సిక్స్‌గా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారని తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.

ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన దుండగులు

బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం సమీపంలో వెలసిన శ్రీ నల్లగుండ్రాయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులో నగదును పట్టుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు, అర్చకులు ముఖద్వారంలో ఉన్న తలుపు తాళాలు పగలకొట్టడంతో అవాక్కయ్యారు. ఆలయం లోపలకు వెళ్లి చూడగా హుండీ తాళాలు పగలకొట్టిన విషయం గుర్తించారు. ఆలయ కమిటీ చైర్మన్‌కు విషయం తెలియజేశారు. భక్తులు కానుకగా సమర్పించిన సుమారు రూ.లక్ష వరకు నగదు తీసుకెళ్లినట్లు చైర్మన్ మురళి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

22న శ్రీచౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: మండలంలోని చదళ్ల గ్రామంలో ఈనెల 22న శ్రీచౌడేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దసరా బ్రహ్మోత్సవాలలో భాగంగా చౌడేశ్వరిదేవిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించి, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొనాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 8 మందిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపారు. వివరాలు.. రాజుపల్లి సమీపంలో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలసి పేకాట శిబిరంపై దాడి చేశారు. అక్కడ 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,250 స్వాధీనం చేసుకుని పోలీస్టేషన్‌కు తరలించి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలమనేరుటౌన్, రూరల్‌మండలం, గంగవరం, బైరెడ్డిపల్లి, వీకోట మండలాల్లో 220 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7.30 వరకు కరెంట్ సరఫరా ఉండదని స్థానిక ట్రాన్స్‌కో ఏడీ జీవన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కుప్పంలో..

కుప్పంరూరల్/శాంతిపురం: కడపల్లి వద్ద ఉన్న 220కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మార్పు పనుల కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రెస్కో ఎండీ ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ల మార్పు కారణంగా కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, వి.కోట మండలాల్లో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. వినియోగదారులు అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న వజ్రా భాస్కరరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలంటే గ్రామ కమిటీలే కీలకమని రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి వజ్రా భాస్కరరెడ్డి తెలిపారు. కల్లూరులో శనివారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి విచ్చేసిన పార్టీ గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఉత్సాహవంతులైన వారిని అన్ని రంగాల్లో ఎంపిక చేసి కమిటీలలో నియమించాలన్నారు. పార్టీ కోసం కష్టపడినందుకు తప్పక గుర్తింపు ఉంటుందని తెలిపారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలే పార్టీని అధికారంలోకి తీసుకువస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీదేవి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అనిషారెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ మిద్దింటి కిషోర్, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ సి.నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, రెడ్డీశ్వరరెడ్డి, హేమ సుందరరెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో ప్రసంగిస్తున్న అనిషారెడ్డి

గ్రామ కమిటీలే కీలకం

రొంపిచెర్ల: వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ ఏర్పాటుకు గ్రామ కమిటీలే కీలకమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనిషారెడ్డి అన్నారు. శనివారం రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు సమీపంలోని ఎంవీఎం కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ సీపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ కమిటీల ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో గ్రామ కమిటీలకు పెత్తనం అప్పగిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వైఎస్ఆర్ సీపీ బలోపేతం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో టీడీపీ దాడులు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. కూటమి దాడులను కలసి కట్టుగా ఎదుర్కోవాలని కోరారు. వైఎస్ఆర్ సీపీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కమలాపురం శ్రీదేవి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, చెంచురెడ్డి, దేవులపల్లె హరినాథరెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, విజయశేఖర్, శ్రీనాథ నాయుడు, సిద్ధరామిరెడ్డి, మహబుబ్‌బాషా, కరీముల్లా, యుగంధర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సురేంద్రనాయుడు, రాజాసాహెబ్, శంకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, యర్రంరెడ్డి, కమలాకర్‌రెడ్డి, వెంకటరత్నం, రవీంద్ర పాల్గొన్నారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు





జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులును సన్మానిస్తున్న ముస్లింలు, శాంతిసందేశం వినిపిస్తున్న ట్రస్టీ నిర్వాహకులు

వి.కోట: మండలంలోని కృష్ణాపురం సమీపంలోని సయ్యద్ అలీ పిరాన్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టులో శనివారం మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీచైర్మన్ శ్రీనివాసులును మతపెద్దలు ఆయనకు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రవక్తకు చెందిన ఆనాటి చిహ్నాలు భక్తుల కోసం ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ట్రస్టీ సభ్యులు మాట్లాడుతూ అల్లా నమ్మిన ఇస్లాం చివరి ప్రవక్త మహ్మద్ ప్రవక్త అని.. ఆయనది శాంతి మార్గమన్నారు. కార్యక్రమానికి కర్ణాటక, తమిళనాడు నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో హిందు, ముస్లింలు సైతం పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ గౌస్, సర్పంచ్ రమేష్ బిల్లా పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



కల్లూరు వద్ద ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు, పరిసర ప్రాంతాల్లో శనివారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. గత పది రోజులుగా ఈ ఏనుగులు పంటలను నాశనం చేస్తూనే ఉన్నాయి. శనివారం రోజు కల్లూరు చుట్టు పక్కల రైతులకు సంబంధించి మామిడి తోపుల్లో ప్రవేశించి భారీగా కొమ్మలను విరిచేశాయి. పంట పొలాలపైకి ఏనుగులు రాకుండా అటవీశాఖ కట్టడి చేయాల్సి ఉంది.

రాజీతో సమస్యలకు స్వస్తి

- అదాలత్‌లో రూ.44.94 లక్షలు పరిష్కారం
- సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫాషేక్



పుంగనూరు లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి ఆరీఫాషేక్

పుంగనూరు: సమస్యలు వెంట పడకుండా కేసులను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రతి ఒక్కరు లోక్‌అదాలత్‌కు రావాలని సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫాషేక్ పిలుపునిచ్చారు. శనివారం కోర్టు ఆవరణలో ఆమె జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 137 కేసులను పరిష్కరించి, రూ.44.94 లక్షలు పరిష్కారం చేసి, కక్షిదారులకు ఇప్పించినట్లు ఆమె తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులపై అప్పీల్ ఉండదని ఆమె తెలిపారు. న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు అంతా సహకరించి, లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేం [illegible]యమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగిస్తూ, సమస్యలు లేని కుటుంబాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు, న్యాయవాదులు బాలాజీకుమార్, వెంకటముని యాదవ్, సురేష్ బాబు, అంజిబాబు, గల్లా శివశంకర్‌నాయుడు, వై.భాస్కర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 245 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ సందర్భంగా మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆదినారాయణ

పలమనేరు: పట్టణ సమీపంలోని కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 245 కేసులు పరిష్కారమైనట్టు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆదినారాయణ తెలిపారు. ఇందులో 3 సివిల్, 186 క్రిమినల్, 56 బ్యాంకు కేసులు తదితరాలను రాజీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. రాజీ అయిన కేసుల రికవరీ రూ35.66 లక్షలకు పైగా ఉంటుందని పేర్కొ న్నారు. ఇందులో బార్ ఆసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కౌండిన్యలో శవమై తేలిన వ్యక్తి గుర్తింపు



దేవేంద్ర(ఫైల్)

పలమనేరు: మండలంలోని కాలువపల్లి కౌండిన్య జలాశయంలో పడి శవమై తేలిన వ్యక్తి పట్టణంలోని ఎస్టీకాలనీకి చెందిన దేవేంద్ర(49)గా తేలింది. గతకొన్నాళ్లుగా పెరాలసిస్‌తో బాధపడుతున్న ఆయన జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడా ? లేక డ్యామ్ వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడా అనే విషయం పోలీసుల విచారణలో తేలనుంది.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

చౌడేపల్లె: ప్రమాదానికి గురై మంచానికి పరిమితమైన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త కాటిపేరి పంచాయతీ కావలివారిపల్లెకు చెందిన చంద్రను మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి పరామర్శించారు. శనివారం స్వగ్రామానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రమాదం తీరును అడిగి తెలుసుకొని మనోధైర్యమిచ్చారు. ఆయన వెంట పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ షంషీర్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, శంకరప్ప, కృష్ణప్ప, నరేష్, గంగిరెడ్డి, ఓబులేశు, నాగభూషణరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పుంగనూరు: అనాథ శవానికి ఏఎస్ఐ అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలో భిక్షాటన చేసే ఓ అనాథ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మున్సిపల్ కార్మికుల సహాయంతో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

అడవితల్లినీ వదలని పచ్చ నేతలు

- జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- కౌండిన్యనదిలో ఇప్పటికే ఇసుక ఖాళీ
- అడవుల్లోని వాగుల నుంచి ఇసుక తవ్వకాలు
- గుడి, బడి పేరిట ఇసుకను తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు



పెంగరగుంట వద్ద టీడీపీ నేత డంప్ చేసిన ఇసుక



పెంగరగుంట అడవిలోని ముగ్గురాళ్ల వాగులో ఇసుకను తోడేసిన దృశ్యం

పలమనేరు: పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుకాసురుల దెబ్బకు ఇప్పటికే ఇసుక ఖాళీ అయింది. దీంతో స్మగర్లు ఇప్పుడు ఇసుక కోసం అడవులపై పడ్డారు. ఇక్కడి కౌండిన్య అభయారణ్యంలో వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలు ఊపందుకున్నాయి. ఫలితంగా పచ్చటి అడవుల్లోని ఇసుకను కూడా వదలకుండా మొత్తం ఖాళీ చేసేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ ఏం చేస్తోందో అర్థం కావడం లేదు.

కౌండిన్య అడవి నుంచి..

పెంగరగుంట ప్రాంతంలోని కౌండిన్య అడవిలోని ముగ్గురాళ్ల వాగు, వంకల నుంచి ఇదే మండలానికి చెందిన ఓ టీడీపీ నేత తన ట్రాక్టర్‌లో అడవిలోంచి ఇసుకను తెచ్చి గ్రామ సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద భారీగా డంప్ చేసిన విషయం శనివారం వెలుగుచూసింది. దీంతో కొందరు గ్రామస్తులు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పచ్చ నేతలు కావడంతో ఎవరూ పట్టించుకోలేదని తెలిసింది. ఇప్పుడు నాణ్యమైన ఇసుక ట్రాక్టర్ రూ.4 వేల దాకా పలుకుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే ప్రభుత్వ పనుల కోసం అంటూ, గ్రామంలో ఆలయం పేరిట చెప్పి యథేచ్ఛగా అడవిలోని ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మండలంలోని అధికారపార్టీకి చెందిన ఓ ముఖ్యనేతకు ఇదే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు మొద్దు నిద్రలో జోగుతున్నాయి. అక్రమార్కులు మాత్రం లక్షలు గడిస్తున్నారు. వీరి దెబ్బకు అడవుల్లోని ప్రకృతి సంపద సర్వనాశనమవుతోంది. ఈ విషయమై అక్కడి ఎఫ్‌బీఓ కిరణ్‌ను వివరణ కోరగా అడవిలోంచి ఇసుకను ఆలయానికి తీసుకెళ్తున్నామని కొందరు తరలిస్తున్న మాట నిజమేనని అయితే వెంటనే ఆపేశామని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల బేఖాతర్..

తాజాగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా అధికారులతో ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. నదీపరివాహక ప్రాంతాలు, అడవుల్లోని వాగులో ఎవరైనా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత శాఖలు దీనిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. కానీ ఆయన ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదనే మాట ఇక్కడ సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను చూస్తే స్పష్టమవుతోంది.